క్లుప్తంగా

అడుగడుగునా నిఘా..



తనిఖీలు చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. బాంబ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అణువణువూ పరిశీలిస్తున్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఆర్ఐ టి.భగవాన్ ఆధ్వర్యంలో బృందాలు నిరంతర నిఘా పెట్టాయి.

కోటలో పులివేషాలు, కత్తిసాము ప్రదర్శన



పులి వేషాల ప్రదర్శన

విజయనగరం: పైడితల్లి సిరిమానోత్సవంలో భాగంగా కోటలో మాన్సాస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సిరిమానోత్సవం పూర్తయిన వెంటనే ఏర్పాటు చేసిన పులి వేషాలు, కత్తి సాము ప్రదర్శనలను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యురాలు అదితి గజపతి, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్, సుధా గజపతి, తదితరులు తిలకించారు.

పైడితల్లి సేవలో ఫైర్ డీజీ



సిరిమానోత్సవంలో పాల్గొన్న ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

విజయనగరం క్రైమ్: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో రాష్ట్ర ఫైర్, డిజాస్టర్ మేనేజ్మెంట్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ పాల్గొన్నారు. ఎస్పీవకుల్ జిందల్ ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సిరిమానోత్సవాన్ని తిలకించారు. గతంలో అతనితో పనిచేసిన పోలీస్ సిబ్బంది డీజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఫైర్, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు

- తమన్నా ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారావు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామకృష్ణారావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: నేటి యువతకు అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడని తమన్నా ఫౌండేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక నవజీవన్ వృద్ధాశ్రమంలో భారతరత్న అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులతో మమేకమవుతూ వారికి మార్గదర్శకత్వం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ అధ్యక్షులు బి.రమణారావు, అరసాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

6 పోస్టులకు 95 దరఖాస్తులు

బాడంగి: మండల కేంద్రంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల వసతిగృహాల్లో ఆరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా, 95 దరఖాస్తులు వచ్చాయని ఎంఈవో పి.లక్ష్మణదొర తెలిపారు. ఇదే విషయమై స్థానిక మండల వనరుల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్మన్, స్కావెంజర్, చౌకీదారు తదితర కేటగిరీల పోస్టులకు బాడంగి, రామభద్రాపురం, తెర్లాం మండలాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.



కోట పరిసర ప్రాంతంలో జన సందోహం మధ్య సిరిమానోత్సవం



క్యూలైన్లో భక్తులు



సిరిమానోత్సవంలో నడుస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పైడితల్లికి ప్రణమిల్లి..

- అడుగడుగునా అమ్మకు నీరాజనం
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- సిరిమానును దర్శించి పులకించిన భక్తులు

విజయనగరం టౌన్:

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తజనం సిరిమాను రూపంలో అమ్మవారిని దర్శించి, తరించారు. వేకువజాము నుంచి అమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. చదురుగుడి నుంచి కోట వరకు.. అటువైపు మిసర్వా థియేటర్ వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. పూసపాటి వంశీయులు, అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, శాసనసభ ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.



వేదాశీస్సులు అందించేందుకు సిద్ధంగా ఉన్న వేదపండితులు



పైడితల్లి అమ్మవారి వ్యాఖ్యానం చేస్తున్న స్వప్నహైందవి, చౌదరి



సిరిమాను అధిరోహించేందుకు వస్తున్న పూజారి

స్వచ్ఛంద సంస్థల సేవలు..

ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్క్రాస్, వివిధ స్వచ్ఛంద సంస్థలు అమ్మవారి సిరిమానోత్సవంలో విశేష సేవలందించాయి. వృద్ధులు, దివ్యాంగులకు తమదైన శైలిలో సాయమందిస్తూ ఉత్సవాన్ని ముందుకు నడిపించారు. వీటితో పాటు పట్టణంలోని పలువీధుల్లో భక్తులకు ఆహార పానీయాలు, ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి, ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, శివాలయం వీధి, ఫూల్బాగ్, తదితర ప్రాంతాల్లో భక్తులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవలందించారు.

పులకించిన భక్తజనం..

సిరిమానుపై అమ్మవారి ప్రతిరూపంగా ఆశీనులైన బంటుపల్లి వెంకటరావు భక్తులపై అక్షింతలు చల్లి ఆశీర్వదిస్తుంటే భక్తజనం భక్తితో ప్రణమిల్లారు. పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో వందలాది మంది దీక్షాపరులు జై పైడిమాంబ నినాదాలతో హోరెత్తించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలు, పాలధార, అంజలి రథం, ఎల్ల ఏనుగు, బెస్తవారి వలతో వచ్చిన వారందరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని విజయవంతం చేశారు. మధ్యాహ్నం 3.43 గంటలకు ప్రారంభమైన ఉత్సవం సాయంత్రం 5.28 గంటలకు ముగిసింది. ఈ అపూర్వ ఘట్టాన్ని లక్షలాది మంది భక్తులు తిలకించి పరవశించిపోయారు. పైడితల్లి అమ్మవారికి జేజేలు పలికారు.

ఆకట్టుకున్న అమ్మవారి వ్యాఖ్యానం

సిరుల తల్లిని కీర్తిస్తూ రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, చౌదరి చేసిన వ్యాఖ్యానం ఆద్యంతం భక్తిభావాన్ని పెంపొందించాయి. సిరిమాను జాతరను ఆద్యంతం వివరించారు. ఓ పక్క ఉత్సవం చరిత్ర చెబుతూనే, మరో పక్క ఉత్సవంలో ప్రత్యక్షంగా జరుగుతున్న ఘట్టాలను భక్తులకు మైక్ల ద్వారా వివరించారు.



మేడపై నుంచి సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఘటాలకు మొక్కుతున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పైడితల్లికి మొక్కుల చెల్లింపు



అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన భక్తులు పైడితల్లికి మంగళవారం ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవం రోజున గ్రామంలో గల పైడితల్లి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడం ఎన్నో ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి చీరలు, పసుపు, కుంకుమ సమర్పించారు.

ఆలయ పూజారి కిలారి సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

అమ్మవారి జాతరలో కార్పొరేషన్ సేవలు భేష్



వీధులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

విజయనగరం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి సిరిమానోత్సవంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. ప్రతి ఏడాదీ నిర్వహించే ఉత్సవంలో భాగంగా కీలకమైన పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాలో చేపట్టిన ముందస్తు ప్రణాళికలు విజయవంతమయ్యాయి. ఉత్సవంలో కీలకఘట్టమైన సిరిమాను సంబరంలో అమ్మవారి ప్రతిరూపంగా భావించే సిరిమానుపైకి విసిరే అరటిపండ్లను శుభ్రం చేయడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అపరిశుభ్ర వాతావరణానికి తావులేకుండా చర్యలు చేపట్టారు. రోజువారీ సిబ్బందితో పాటు అదనంగా 430 మందిని నియమించడంతో వెంటవెంటనే పారిశుధ్య పనులు చేపట్టారు. అలాగే నగరమంతా వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రధాన జంక్షన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొత్తానికి పట్టణం సుందరంగా, పరిశుభ్రంగా కనిపించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బయో టాయిలెట్లు, తాగునీటి సరఫరా కేంద్రాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

భద్రత గాలికొదిలేశారు..!

- ప్రమాదకరంగా ఆర్ఓబీ నిర్మాణ పనుల ప్రాంగణం
- కానరాని కనీస జాగ్రత్త చర్యలు, హెచ్చరిక బోర్డులు



ఆర్ఓబీ వద్ద గతంలో కట్టిన షెడ్ నెట్ ఊడిపోయిన దృశ్యం



ఆర్ఓబీ నిర్మాణం వద్ద ఎలాంటి భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు లేని దృశ్యం

చీపురుపల్లి: సాధారణంగా రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేసే ప్రాంతాల్లో ఆ పనుల వల్ల ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడం సంబంధిత కాంట్రాక్టర్ల బాధ్యత. నిర్మాణాలు చేపట్టే ప్రాంతాల్లో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా కాంట్రాక్టర్ భద్రత చర్యలను పట్టించుకోకపోతే ఆ బాధ్యత పోలీసులైనా తీసుకోవాలి. కానీ చీపురుపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) పనులు చేస్తున్న ప్రాంతంలో అటు కాంట్రాక్టర్, ఇటు పోలీసులు ప్రజల భద్రత గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చీపురుపల్లి నుంచి రాజాం వెళ్లే రోడ్డులో ఆర్ఓబీ నిర్మాణం కోసం చాలా కాలం క్రితమే పెద్దఎత్తున తవ్వకాలు చేశారు. అయితే ఇది పాలకొండ -విశాఖపట్నం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పాలకొండ, రాజాం ప్రాంతాలకు చెందిన ప్రయాణికులే కాకుండా తెర్లాం మండలం నుంచి చీపురుపల్లి మీదుగా విశాఖపట్నం, విజయనగరం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు ఆర్ఓబీకి అవతలి వైపు జి.అగ్రహారంతో పాటు గరివిడి మండలంలోని వెదుళ్ల వలస, కుమరాం, కె.పాలవలస, బొండపల్లి, ఎం.దుగ్గివలస, ఐతంవలస మెరకముడిదాం మండలం లోని బిల్లలవలస, సాతాంవలస, కొండదాడి, భగీరథపురం, తదితర ప్రాంతాలకు చెందిన వారంతా చీపురు పల్లి, గరివిడి మండల కేంద్రాలకు ఈ ఆర్ఓబీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని దాటుకుని రావాల్సి ఉంటుంది. పనులు చేస్తున్న ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి భద్రతా చర్యలు లేకపోవడంతో పాటు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రయాణికుల డిమాండ్ మేరకు పనులు చేస్తున్న ప్రదేశంలో షేడ్ నెట్లు కట్టారు. అవి కాస్త ఊడిపోవడంతో ప్రస్తుతం ఎలాంటి భద్రత లేకుండా పోయింది. స్థానికంగా ఉండే ప్రయాణికుల సంగతి పక్కన పెడితే పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రాత్రి సమయాల్లో ఆదమరిస్తే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. ఈ రోడ్డులో కొత్తగా ప్రయాణించే వారు రాత్రి సమయాల్లో ఆర్ఓబీ నిర్మాణం వద్ద గోతులను గుర్తించేలా రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు అయినా స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆశాజనకంగా వరి సాగు



పూసపాటిరేగ సమీపంలో వరి పైరు

పూసపాటిరేగ: ఖరీఫ్ వరిసాగు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో పాటు వర్షాలు సాగుకు సరిపడా కురవడంతో పంట ఏపుగా పెరగి పొట్ట దశకు చేరుకుంది. ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు గ్రామాలలో వరిసాగును పరిశీలించి అంచనాలను తయారు చేస్తున్నారు. వరిసాగుకు కావాల్సిన సూచనలు, సలహాలు రైతులకు అందిస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించేలా అన్నదాతలకు సూచనలు ఇచ్చారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఈఏడాది సుమారు 11,085 ఎకరాలలో వరి సాగవుతోంది. పూసపాటిరేగ మండలంలో 3100 ఎకరాల్లో.. డెంకాడ మండలంలో 2805, నెల్లిమర్ల మండలంలో 2780, భోగాపురంలో 2400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఎకరాకు 30 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పగటిపూట అధిక ఉష్ణోగ్రత, రాత్రిపూట శీతల వాతావరణం ఉండడంతో పంటలకు అక్కడక్కడా తెగుళ్లు ఆశిస్తున్నాయి. అయితే వ్యవసాయాధికారులు సూచనలు అందిస్తుండడంతో అన్నదాతలు పంటలను కాపాడుకుంటున్నారు.

వరి ఎర్రబారుతోంది

పొటాష్ లోపంతో వరిపైరు ఎర్ర బారుతోంది. ప్రస్తుతం వరి చిరు పొట్ట దశకు చేరుకుంది. ఈ సమయంలో పొటాష్ వేసినట్లయితే కొంత ఉపయోగం కనిపిస్తుంది. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి వేపనూనె స్ప్రే చేయడం వల్ల కొంత ప్రయోజనం కలుగుతుంది.

ఎం.జయరాం, ఆదర్శరైతు, పూసపాటిపాలెం